


పేద విద్యార్థులకు 'ప్రైవేట్'లో అవకాశం : కలెక్టర్

ప్రజాశక్తి-తిరుపతి టౌన్ ఆర్థికంగా వెనుకబడిన పేద కుటుంబాల విద్యార్థులకు ప్రైవేట్ అన్ ఎయిడెడ్ విద్యాసంస్థల్లో, 2023-24 విద్యా సంవత్సరం 1వ తరగతిలో అడ్మిషన్ కొరకు ఏప్రిల్ 1వ తేదీ నాటికి 5 సంవత్సరాలు వయస్సు పూర్తి అయిన పిల్లల వివరాలతో ఏప్రిల్ 10 వ తేదీ లోపు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని, జిల్లాలో 423 ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 4230 మందికి అవకాశం వుందని కలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యా హక్కు చట్టం -2009, ఎ.పి ఆర్.టి.ఇ 2023, సెక్షన్ 12(1) (సి) ప్రకారం ప్రైవేట్ అన్ ఎయిడెడ్ విద్యా సంస్థల్లో 25శాతం సీట్లు ఆర్థికంగా వెనుకబడిన తరగతుల పేద కుటుంబాలకు కేటాయింపు కొరకు నిబంధనలు పొందుపంచడం జరిగింది. సామాజికంగా ఆర్థికంగా వెనుకబడిన వారు, దారిద్ర్యరేఖకు దిగువన వున్నవారు, భూమిలేని వ్యవసాయ కూలీలు, దివ్యాంగులు, ఎస్.సి, ఎస్టీలు అర్హులని, గ్రామ,వార్డు సచివాలయాల్లో ఉచిత దరఖాస్తు సదుపాయం కల్పించబడిందని, పిల్లల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



ఇంటి 'పన్ను'తోనే... 'చెత్త' కూడా..



విడిగా వసూలు చేసే విధానానికి స్వస్తి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ప్రతినెలా వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి చెత్త పన్ను వసూలు చేయడం ఒక ఎత్తయితే, ఎంత వసూలు చేసినా పూర్తిస్థాయిలో వసూలు కాకపోవడం ప్రభుత్వానికి తలనొప్పిగా మారింది. కొన్నిచోట్ల ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుండడంతో కార్పొరేషన్ అధికారులు సరికొత్త వ్యూహం రచించారు. ఆస్తిపన్నుతో పాటే 'చెత్త' పన్ను వసూలు చేసేందుకు సమాయత్తం అవుతున్నారు. ఈ మేరకు డిమాండ్ నోటీసులను సిద్ధం చేస్తున్నారు. ఇలా చేస్తేనే చెత్త పన్ను 'వచ్చినట్టు' కడతారన్నది కార్పొరేషన్ అధికారుల వ్యూహం. ఆదాయాన్ని సమకూర్చుకోవడంలో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ చెత్తపై పన్ను(యూజర్ చార్జీలు) నెలకు రూ 50లక్షలు వసూలు చేయాల్సి ఉండగా కేవలం రూ 25నుంచి 30 లక్షలు మాత్రమే వసూలు చేస్తున్నట్లు సమాచారం. దీంతో యూజర్ చార్జీలు పెంచి ఖజానా నింపుకోవాలని చర్యలు చేపట్టారు. నెలకు 70నుంచి కోటి రూపాయలు చేయాలన్న లక్ష్యం పెట్టుకున్నారు. ఏప్రిల్ 1నుంచి మున్సిపల్ కార్పొరేషన్ ,మున్సిపాలిటీలు ఇంటిపన్నుతో పాటు యూజర్ ఛార్జీలు(చెత్తపన్ను) కలిపి ఇంటి యజమానులకు డిమాండ్ నోటీసులు ఇవ్వనున్నారు. ఇప్పటి వరకు యూజర్ చార్జీలను ఆయా డివిజన్లలో సచివాలయ ఉద్యోగులు వసూలు చేసి రశీదులు ఇచ్చేవారు. ఏప్రిల్ నుంచి ఆ విధానానికి స్వస్తి పలికి ఆస్తిపన్నుతో పాటు యూజర్ చార్జీలు కూడా కలిపి వసూలు చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఆస్తిపన్నుతో పాటు యూజర్ చార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం 2020 సంవత్సరం నుంచి యూజర్ చార్జీలు వసూళ్లు మొదలు పెట్టింది. అయితే దీని పై ప్రజల నుంచి పూర్తి వ్యతిరేకత వచ్చింది. చెత్తపై పన్ను ఏమిటంటూ ప్రజలు నిరసన చేశారు. వామపక్షాలు దీక్షలు పాటు ఉద్యమాలు నడిపాయి. అయినా ప్రభుత్వం తప్పనిసరిగా చెల్లించాల్సిందేనని స్పష్టం చేసింది. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్లో 50 డివిజన్లు ఉన్నాయి. ఒక్కో డివిజన్లో చెత్తసేకరణకు వాహనాలు ఏర్పాటు చేశారు. యూజర్ చార్జీల కింద ప్రతి ఇంటికీ రూ 40, అపార్ట్మెంట్లో ఉన్న వారికి రూ 50నుంచి 100 వసూలు చేస్తున్నారు. మురికి వాడలో నివాసం ఉన్నవారి వద్దనూ వసూళ్లు చేస్తున్నారు. కళ్యాణ మండపాలు, హోటళ్లు, షాపింగ్ మాల్స్ నుంచి నెలకు 2వేల నుంచి 5వేలు వసూలు చేస్తున్నారు. ఈ యూజర్ చార్జీలను జగనన్న స్వచ్ఛ సంకల్పం పేరిట వసూలు చేస్తున్నారు. అయితే వీటి నిర్వహణ బాధ్యతను మున్సిపల్ కార్పొరేషన్ అధికార్లు చూస్తున్నారు. తిరుపతి కార్పొరేషన్ ఇప్పటికే స్వచ్ఛాంద్ర కార్పొరేషన్ నుంచి వాహనాలు కొనుగోలు చేసింది. ఇప్పటికే టిప్పర్లు, ఆటోలు, పెద్దపెద్ద వాహనాలు కలిపి సుమారు 70దాకా ఉంటాయి. తిరుపతి కార్పొరేషన్లో సుమారు 3లక్షల మంది జనాభా కలిగి ఉన్నారు. 65వేలపైగా గృహాలు ఉన్నాయి. యూజర్ చార్జీలు పెంచి ఖజానా పెంచుకోవడం పట్ల ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోంది. ఉచితంగా కార్పొరేషన్ సేవలు అందించాల్సింది పోయి, ప్రజలపై భారాలు మోపడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఏప్రిల్ నుంచి డిమాండ్ నోటీసులో యూజర్ చార్జీలు కలిపి ఇవ్వనున్నారు. దీనిపై ఈనెల 10తేదీ జరగనున్న కౌన్సిల్ సమావేశంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాల్సిందే. ఇప్పటికే భారాలతో ప్రజలు సతమతమవుతున్నారు. అయినా ఆదాయమే పరమావధిగా ఉన్న కౌన్సిల్ నిర్ణయంతో జనం మరింత ఇబ్బందులు పడక తప్పదు.

అందుకేనా...!

'ఢిల్లీ'పై చెవిరెడ్డి 'కన్ను'
కొడుక్కి చంద్రగిరి బాధ్యతలు



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

రాష్ట్ర రాజకీయాల నుంచి జాతీయ రాజకీయాల వైపు చెవిరెడ్డి దృష్టి మళ్లింది. పదేళ్ల పాటు చంద్రగిరి ఎంఎల్ఎగా ఉన్న చెవిరెడ్డి దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకుందామనే చందంగా అధికారం ఉండగానే కొడుకు మోహిత్‌రెడ్డిని రాజకీయ వారసునిగా తెరపైకి తెచ్చారు. దీనికి వేదిక 'స్థానిక' ఎన్నికలు కలిసొచ్చాయి. తిరుపతి రూరల్ ఎంపిటిసిగా ఏకగ్రీవంగా ఎన్నికైన మోహిత్‌రెడ్డి ఎంపిపిగా రాజకీయ అరంగేట్రం చేపట్టారు. నియోజకవర్గంపై పట్టు సాధించేందుకు 600 కిలోమీటర్ల పాదయాత్రను చేపట్టారు. తిరుపతి రూరల్, చంద్రగిరి, పాకాల, చిన్నగొట్టిగల్లు, యర్రావారిపాళెం, రామచంద్రాపురం మండలాల్లో పాదయాత్ర కొనసాగుతోంది. జగన్ సంక్షేమ పథకాలను, తన తండ్రి చేపట్టిన అభివృద్ధి పనులను ప్రచారం చేస్తూ పాదయాత్రలో జనంతో మమేకమవుతున్నారు మోహిత్‌రెడ్డి. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం తన కొడుకు మోహిత్‌రెడ్డిని నియోజకవర్గ ప్రజలు ఆదరించాలని ప్రకటించారు. జగన్మోహన్‌రెడ్డి సైతం రాష్ట్రంలో తొలి సీటు మోహిత్‌రెడ్డిని ఖరారు చేసినట్లు తెలుస్తోంది. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు యువతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో తిరుపతిలో భూమన కరుణాకర్‌రెడ్డి తనయుడు భూమన అభినయ్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు మోహిత్‌రెడ్డిలకు టికెట్ ఖరారు చేసినట్లు వార్తలు వస్తున్నాయి. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి 2024 ఎన్నికల్లో కీలకంగా రాష్ట్రవ్యాప్తంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేయనున్నారు. ఈ నేపథ్యంలోనే ఏడాదిక్రితం తిరుపతి జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ అధ్యక్షులుగా జగన్ ప్రకటించారు. రానున్న రాజ్యసభ ఎన్నికల్లో ఎంపిగా చెవిరెడ్డికి అవకాశం ఇస్తారని సమాచారం. వైసిపి, బిజెపికి అసెంబ్లీ ఎన్నికల్లో మిత్రత్వం ఉంటే జగన్‌కు అత్యంత నమ్మినబంటుగా ఉన్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి కేంద్రమంత్రిగా అవకాశం ఇచ్చినా ఆశ్చర్యపోవల్సిన అవసరం లేదు.

చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి భూమన ఆశీస్సులు

2024 సార్వత్రిక అసెంబ్లీ ఎన్నికల్లో చంద్రగిరి నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలోకి దిగుతున్న యువనేత చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి ఆశీర్వదించారు. శుక్రవారం పద్మావతిపురంలోని భూమన ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ముఖ్యమంత్రి జగనన్న సూచన మేరకు వచ్చే ఎన్నికల్లో చంద్రగిరి నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా మోహిత్ ను బరిలోకి దించుతున్నట్లు వివరించారు. దీంతో సంతోష పడిన భూమన కరుణాకర్ రెడ్డి "విజయోస్తు.. దిగ్విజయోస్తు.." అంటూ నిండు మనస్సుతో దీవించారు. అనంతరం మోహిత్‌ను ఆప్యాయంగా దగ్గరకు తీసుకొని అంతా మంచి జరుగుతుందని, ప్రజల ముందుకు ధైర్యంగా వెళ్లాలని ప్రోత్సహించారు.



'సంకెళ్లు తెంచుకుంటూ' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-తిరుపతి సిటి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రిటైర్డు ఐఏఎస్ అధికారి కాకి మాధవరావు రచించిన 'సంకెళ్లు తెంచుకుంటూ...(ఓ దళిత చీఫ్ సెక్రటరీ ఆత్మకథ)ను రాజ్యాంగ నిర్మాత డాక్టరు బాబాసాహెబ్ బిఆర్ అంబేద్కర్ మనవడు ప్రకాష్ అంబేద్కర్ ఆవిష్కరించారు. తిరుపతి ఎస్‌వియులోని శ్రీనివాస ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ మాధవరావు తన ఆత్మకథను రచించి, భావిభారత పౌరులకు సమాజంలోని పరిస్థితులను అవగాహన కల్పించేందుకు కృషి చేశారన్నారు. సాధారణంగా పదవీ విరమణ అనంతరం విశ్రాంతి సమయాన్ని సేద తీరేందుకు ఉపయోగించుకుంటారని, కానీ మాధవరావు తన జీవితంలో పడిన కష్టాలను యువతకు తెలియజేసి, అలాంటి వాటిని ఎలా ఎదుర్కొవాలనే అంశాలను తన పుస్తకం ద్వారా తెలియజేందుకు కృషి చేయడం సమాజం పట్ల అయనకు ఉన్న నిబద్ధతను తెలియజేస్తుందని వెల్లడించారు. చిన్నతనంలోనే ఆయన ఓ అణగారిన వర్గాలకు చెందిన వ్యక్తిగా అనేక కష్టాలు పడి, తల్లి ప్రోత్సాహంతో, తండ్రి సహకారంతో ఉన్నత చదువులు చదివి సమాజంలో అనేక కుళ్లును ఏరివేయాలని ఆలోచించారని, ఆ దిశగా



తన పయనం సాగిందన్నారు. ఈ పుస్తకం ద్వారా తాను పడిన కష్టాలు, ఎదుర్కొన్న సమస్యలు, వాటిని ఎలా పరిష్కరించాను, ఇంకా ఎలా చేస్తే బాగుంటదనే విషయాలను ప్రతి ఒకరికి అర్థమయ్యే సులభతరమైన బాషలో అందించారన్నారు. సమాజం పట్ల ప్రతి ఒక్కరికి తప్పని సరిగా అవగాహన ఉండాలన్నారు. సమాజంలో మార్పు కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. పాలేరు స్థాయి నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హోదా వరకు కాకి మాధవరావు ఎదిగి, తన అనుభవాలను నేటి తరానికి అందించడం అభినందనీయమన్నారు. ఎస్‌వియు విసి రాజారెడ్డి మాట్లాడుతూ కృష్ణా జిల్లాలో ఓ సాధారణ కుటుంబంలో పుట్టిన మాధవరావు, పాలేరు దగ్గర నుంచి జీవితాన్ని ప్రారంభించారని, అనేక ఇబ్బందులను, కష్టాలను అనుభవిస్తూ చదువు ఒకటే మనిషి తలరాతను మార్చగలదని అంబేద్కర్ చెప్పిన విషయాలను అవగాహన చేసుకుని, ఉన్నత చదువులు చదవి, సివిల్స్‌లో మెరిట్‌సాధించి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఎదిగారని గుర్తు చేశారు. ఆయన రచించిన పుస్తకాన్ని నేటి తరం అవగాహన చేసుకోవాలన్నారు. సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యే వారికి ఇది ఎంతో దోహదం చేస్తుందన్నారు. అనంతరం రచయిత కాకి మాధవరావు మాట్లాడుతూ సమాజంలో మార్పు కోసం, సమసమాజ స్థాపన కోసం, యువత అభివృద్ధి కోసం తన విశ్రాంతి జీవితంలో కూడా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ సెక్రటరీ కె.ప్రవీణ్‌కుమార్, ప్రిన్సిపాల్ సెక్రటరీ కె.సునీత, డాక్టరు గౌతమ్, తిరుపతి విమానాశ్రయం డైరెక్టరు ఎం.రాజా కిషోర్, నెదురుమల్లి రామ్‌కుమార్, శివ బాగ్యరావు, సిహెచ్.విజయరావు, ప్రసాదరావు, దినకరమూర్తి, సుబ్రమణ్యం, రిటైర్డు జడ్జీ గుర్రప్ప, జనార్ధన రావు, కిరణ్‌కుమార్, సిద్ధోజిరావు, ఎం.బాలాజీ, సురేష్, ప్రొఫెసర్ సరసయ్య పాల్గొన్నారు.

సర్వే రాళ్లు నాటే ప్రక్రియ త్వరగా పూర్తవ్వాలి : జేసీ

తిరుపతి టౌన్ : జిల్లాలో రీసర్వే, గ్రౌండ్ ట్రూథింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డికె బాలాజీ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి ఆర్డీవోలు, తహశీల్దారులు, సర్వే అధికారులతో రీ సర్వే, ఒడిఎస్, గ్రౌండ్ ట్రూథింగ్, స్టోన్ ప్లాంటేషన్, మ్యూటేషన్, అసైన్‌మెంట్ ల్యాండ్స్ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. కొన్ని గ్రామాలలో గ్రౌండ్ ట్రూథింగ్ పనులు లక్ష్యం మేరకు పూర్తి కావడం లేదని అధికారులు దష్టి పెట్టి పనులను వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ. శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కోదండరామి రెడ్డి, , ఏ.డి. సర్వే జయరాజ్ పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులకు ఎస్‌సి హోదాలో ప్రభుత్వ తీరు హర్షణీయం

ప్రజాశక్తి-తిరుపతి సిటి



రాష్ట్రంలోని దళిత క్రైస్తవులకు ఎస్‌సి హోదా కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి హర్షణీయమని ఆంధ్రప్రదేశ్ బిషప్స్ కైన్సిల్ చైర్మన్ డాక్టరు ఎలమంచిలి ప్రవీణ్ తెలిపారు. శుక్రవారం నిర్వహించిన బిషప్ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళిత క్రైస్తువులకు ఎస్‌సి హోదా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించి, అసెంబ్లీలో తీర్మానం చేయడం, దాన్ని పార్లమెంట్‌కు పంపడమే కాకుండా, దీనిపై సుప్రీంకోర్టులో ఉన్న కేసుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తరుపున ఇంప్లీడ్ అవ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. గత ప్రభుత్వం ఎస్‌సి హోదా కల్పించడంలో మొండి చేయి చూపించారని, సుదీర్ఘకాల సమస్యను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బాధ్యతయుతంగా వ్యవహరించి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో బిషప్ కౌన్సిల్ అద్యక్షులు బాలరాజు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి తోడ్పడండి : ఎమ్మెల్యే భూమన

తిరుపతి టౌన్ : రాష్ట్రంలోని పేద ప్రజల అభివృద్ధే ధ్యేయంగా నిరంతరం పాటుపడుతూ ఇచ్చిన హామీల అమలుకు సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డికి మీరంతా అండగా వుంటూ రాష్ట్రాభివృద్ధికి తోడ్పాడాలని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి కోరారు. వై.ఎస్.ఆర్ ఆసరా మూడో విడత సంబరాల్లో భాగంగా శుక్రవారం తిరుపతి నెహ్రూ మునిసిపల్ హైస్కూల్ గ్రౌండ్ లో జరిగిన సభలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి, కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలు బ్యాంకు ద్వారా పొందిన రుణాలు మాఫీ గురించి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన మాటను నెరవేర్చుటకు నాలుగు విడుతలగా పొదుపు సంఘాలలో 2019 ఏప్రిల్ నాటికి నిల్వ ఉన్న రుణ బకాయిలను పూర్తిస్థాయిలో ప్రభుత్వమే చెల్లిస్తున్నదని, ఇప్పటికే వైయస్సార్ ఆసరాను రెండు మార్లుగా 15,84,05 6 సంఘాలకు 1 కోటి 56 లక్షల 62 వేల 834 మందికి, 12758.28 కోట్లు ఇదివరకే జమ చేయడం జరిగిందని, ఇప్పుడు మూడో విడతగా 7,98,395 సంఘాలకు 78,94,169 మందికి 6,419.89 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బసవగీత, పొన్నాలచంద్రా, సి.కె.రేవతి, శ్రావణిమునిరామి రెడ్డి, తిరుత్తణి శైలజా, శేఖర్ రెడ్డి, నరేంద్రనాథ్ పాల్గొన్నారు.



1 నుంచి ఎపిపిఎస్‌సి ఉద్యోగ పరీక్షలు : డిఆర్‌ఒ

తిరుపతి టౌన్ : ఏప్రిల్ 1 నుండి 4 వరకు ఎపిపిఎస్ సి ఉద్యోగ పరీక్షలు జరగనున్నాయని, ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని సంబంధిత అధికారులను జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఎపిపిఎస్‌సి ఉద్యోగ పరీక్షలు నిర్వహణపై పరీక్షల కష్టోడియన్ డి.ఆర్.ఓ.శ్రీనివాసరావు ఎపిపిఎస్సి సెక్షన్ అధికారులు గిరిజారాణి , యశోదా లతో కలసి సమీక్ష నిర్వహించి పలు ఆదేశాలు జారీచేసారు. డి.ఆర్.ఓ. మాట్లాడుతూ విధులు కేటాయించిన అధికారులు పలు పరీక్షలు నిర్వహణలో అనుభవం వున్నవారేనని, చిన్న పొరపాటుకు తావులేకుండా నిర్వహణ జరగాలని అన్నారు. ఏప్రిల్ 1 నుండి 3 వరకు మూడురోజులు రెండు షిఫ్ట్‌లలో పరీక్షలు జరుగుతాయని తెలిపారు. జూపార్కు వద్దగల ఇయాన్ డిజిటల్, రామిరెడ్డిపల్లి వద్ద ఇయాన్ డిజిటల్, గూడూరు ఆదిశంకరా కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల, గూడూరు నారాయణ



ఇంజినీరింగ్ కళాశాల, గూడూరు ఆదిశంకరా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలలో పరీక్షలు జరుగుతాయని తెలిపారు. పరీక్షా కేంద్రాలకు బసుస సౌకర్యం, పోలీసు బందోబస్తు, విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. ఈ సమీక్షలో లైజన్ అధికారులు , ఎపి ఎస్ ఆర్ టిసి సత్యనారాయణ , వైద్య ఆరోగ శాఖ డా.హర్షవర్ధన్, స్పెషల్ బ్రాంచ్ చంద్ర , గణపతి , రవీంద్ర , సెక్షన్ సూపరింటెండెంట్ చంద్ర శేఖర్ , డి టి చెంచయ్య పాల్గొన్నారు.

ఎస్‌కెవి టూవీలర్స్ ఫైనాన్స్ ప్రారంభం

ప్రజాశక్తి-తిరుపతి సిటి

తిరుపతి ఎంఎల్‌ఏ భూమన కరుణాకర్‌రెడ్డి చేతులు మీదుగా నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్‌కెవి టూవీలర్స్ ఫైనాన్స్‌ను శుక్రవారం ప్రారంభించారు. స్థానిక రేణిగుంట రోడ్డులోని శ్రీనివాసపురం వద్ద ఎంఎన్‌ఎం పెట్రోల్ బంకు పక్కన ఏర్పాటు చేసిన ఆ కార్యాలయం వద్ద ఎండి చదలవాడ సురేష్ మాట్లాడుతూ అన్ని రకాల టూవీలర్స్‌కు ఇక్కడ ఫైనాన్స్ అందిస్తామన్నారు. మధ్యతరగతి ప్రజల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, వారికి కూడా ద్విచక్రవాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు తమ వంతు కృషి చేయాలనే ఉద్దేశంతో పాటు పది మందికి ఉపాధి కల్పించాలనే కృతనిశ్చయంతో ఈ ఫైనాన్స్ సెంటర్‌ను ప్రారంభించామన్నారు. దీన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిరుపతి కోఆపరేటివ్ టౌన్‌బ్యాంకు ఛైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, డాలర్ దివాకర్‌రెడ్డి, సోమశేఖర్, కార్పొరేటర్ అనిల్ రాయల్, వైసిపి నాయకులు జల్లి తులసీ యాదవ్, ప్రతిమ, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



క్యారట్‌లెన్ షోరూం ప్రారంభం

ప్రజాశక్తి-తిరుపతి సిటి

తిరుపతిలో నూతనంగా ఏర్పాటు చేసిన క్యారట్‌లెన్ షోరూమ్‌ను ఎంఎల్‌ఏ భూమన కరుణాకర్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. స్థానిక ఎయిర్‌బైపాస్‌రోడ్డులోని డి.మార్టు పక్కన ఏర్పాటు చేసిన ఆ షోరూమ్ వద్ద క్యారట్‌లెన్ ప్రతినిధి శ్రీని, షోరూమ్ అధినేత దీపక్‌రెడ్డి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఈ సంస్థకు చెందిన 220 బ్రాంచిలు నడుస్తున్నాయన్నారు. శుక్రవారం ఒకే రోజు దేశ వ్యాప్తంగా 20 బ్రాంచిలను ప్రారంభించామని, అందులో తిరుపతి కేంద్రం ఒకటన్నారు. ఈ షోరూమ్‌లో అన్ని రకాల అధునూతనమైన ఉత్పత్తులను అందిస్తున్నామన్నారు. పురిటి బిడ్డ నుంచి 60 సంవత్సరాలు వయస్సున వారికి నచ్చే, మెచ్చే వివిధ రకాల డైమండ్‌తో కూడిన బంగారు ఆభరణాలు అందిస్తున్నామన్నారు. ఇక్కడ 5 వేల రూపాయలు నుంచి 5 లక్షల రూపాయల వరకు విలువ కల్గిన, 1000కి పైగా డిజైన్లు లభ్యమవుతాయని తెలిపారు. ఈ షోరూమ్‌లో కొనుగోలు చేసిన బంగారు ఆభరణాలు దేశ వ్యాప్తంగా తమకు చెందిన అన్ని షోరూమ్‌లలో ఎక్చేంజ్ అవకాశం కల్పిస్తున్నామని, ఒక ఏడాది గ్యారెంటీతో పాటు మనీబ్యాకు అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయరు ముద్రనారాయణ, సిఐ సురేంద్రనాద్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, కేతం జయచంద్రారెడ్డి, మహీ, కార్పొరేటర్ అంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యం అభివృద్ధికి కృషి

ఔషధ ఉత్పత్తుల నూతన కేంద్రం ప్రారంభించిన ఛైర్మన్

ప్రజాశక్తి - తిరుపతి అర్బన్

ఆయుర్వేద వైద్యాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి, ఈవో ఎవి ధర్మారెడ్డి అన్నారు. నర్సింగాపురంలోని శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేద ఫార్మసీలో నూతనంగా నిర్మించిన ఔషధ ఉత్పత్తుల తయారీ కేంద్రాన్ని శాస్త్రోక్తంగా పూజల అనంతరం లాంఛనంగా వారు ప్రారంభించారు. అనంతరం వైవి సుబ్బారెడ్డి మీడియాతో మాట్లాడుతూ పూర్వీకులు అందించిన ప్రాచీన ఆయుర్వేద వైద్యాన్ని అభివృద్ధి చేయడానికి టిటిడి ఎంతో కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగానే 1983లో ఆయుర్వేద వైద్య కళాశాలను, అనుబంధంగా ఆయుర్వేద ఆస్పత్రిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయుర్వేద ఆస్పత్రి దినదినాభివృద్ధి చెందుతూ ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఇక్కడికి వస్తున్న రోగులకు అత్యుత్తమ వైద్యసేవలు అందిస్తోందన్నారు. ఆస్పత్రికి మందులు సొంతంగా తయారు చేసుకోవడం కోసం నర్సింగాపురంలో 1990లో 14.75 ఎకరాల్లో టిటిడి ఆయుర్వేద ఫార్మసీని ఏర్పాటు చేసిందన్నారు. మొదట 10 రకాల మందులు మాత్రమే తయారు చేసిన ఈ ఫార్మసీ కాలక్రమేణా 80 రకాల మందులు తయారు చేసి ఆయుర్వేద ఆస్పత్రితో పాటు తిరుపతి, తిరుమలలో డిస్పెన్సరీలకు సరఫరా చేస్తోందన్నారు. ఆయుర్వేద వైద్యాన్ని మరింతగా ప్రజలకు చేరువ చేసేందుకు తమ పాలకమండలి నిర్ణయించిందన్నారు. ఇందుకోసం ఫార్మసీ భవనాలను ఆధునీకరించడంతో పాటు, మూడు ఔషధ ఉత్పత్తి కేంద్రాలను నిర్మించి రూ.3.90 కోట్లతో అధునాతన యంత్ర పరికరాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మొదటి విడతగా తొలి ఔషధ ఉత్పత్తి కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించినట్లు చెప్పారు. ఇప్పటివరకూ ఏడాదికి రూ.1.5 కోట్లు విలువ గల మందులను తయారు చేసే ఈ ఫార్మసీలో, ఇకపై ఏడాదికి రూ.5 కోట్లు విలువ చేసే మందులను తయారు చేసే సామర్థ్యం లభిస్తుందన్నారు. టిటిడి అవసరాలకు పోను, మిగిలినవి ఆయుష్ వైద్యశాలలకు విక్రయించేలా రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జేఈవో సదా భార్గవి, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, సూపరింటెండెంట్ డాక్టర్ రేణు దీక్షిత్, ప్రిన్సిపల్ డాక్టర్ మురళీకృష్ణ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సుందరం, ఇఇ మురళీకృష్ణ, విజిఒ మనోహర్, ఆయుర్వేద ఫార్మసీ సాంకేతిక అధికారి డాక్టర్ నారపరెడ్డి పాల్గొన్నారు.

గోశాలలో రోజుకు రూ.4వేల లీటర్ల పాల ఉత్పత్తి

తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు టిటిడికి రోజువారీ అవసరమయ్యే నాలుగువేల లీటర్ల పాలను ఎస్వీ గోశాలలోనే ఉత్పత్తి చేసుకునే దిశగా కార్యాచరణ అమలు చేస్తున్నామని టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి తెలిపారు. టిటిడి తయారు చేస్తున్న అగరబత్తీల ఉత్పత్తిని డిమాండ్‌కు తగినట్లుగా పెంచే చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎస్వీ గోశాలలో నిర్మించిన ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్, టిటిడి ఆలయాల్లో ఉపయోగించిన పువ్వులతో తయారు చేసే అగరబత్తుల రెండో యూనిట్‌ను ఛైర్మన్, ఈవోలు ప్రారంభించారు. తిరుమల ఆలయంతో పాటు, తిరుమల, తిరుపతిలోని అనుబంధ ఆలయాల నిత్య కైంకర్యాలకు అవసరమయ్యే స్వచ్ఛమైన పాలు, పెరుగు, వెన్న, నెయ్యి సొంతంగా తయారు చేసుకోవాలని టిటిడి పాలకమండలి నిర్ణయించిందన్నారు. ఇందుకోసం రూ.11 కోట్లతో టిటిడి సొంతంగా ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్ నిర్మించినట్లు చెప్పారు. దాత ఒకరు రెండు కోట్లు విరాళంగా ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు పోకల అశోక్‌కుమార్, శ్రీ వేంకటేశ్వర పశు వైద్య విశ్వ విద్యాలయం ఉప కులపతి డాక్టర్ పద్మనాభరెడ్డి, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, గోశాల డైరెక్టర్ డాక్టర్ హరనాథరెడ్డి, గోసంరక్షణ ట్రస్టు సభ్యులు



రామ్‌సునీల్‌రెడ్డి పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

లక్నో, అహ్మదాబాద్‌లకు చెందిన ఐఐఎం ప్రొఫెసర్లు ఎన్.రవిచంద్రన్, వెంకటరమణయ్య దాదాపు మూడేళ్లు కృషి చేసి రాసిన 'మేనేజింగ్ సోషియల్ ఆర్గనైజేషన్స్ లెషన్ ఫ్రం వరల్డ్ లార్జెస్ట్ పిలిగ్రమేజ్ సెంటర్' పుస్తకాన్ని టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి, ఈవో ఎవి ధర్మారెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. పద్మావతి విశ్రాంతి గృహంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ వైవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ పుస్తక రచయితలు 2017 నుండి 2021 వరకు టీటీడీ యాజమాన్య నిర్వహణ, భక్తుల రద్దీ నిర్వహణ, దర్శనం, అన్నప్రసాద వితరణ, లడ్డూ ప్రసాదాల తయారీ , పంపిణీ లాంటి అన్ని అంశాల్లో టీటీడీ యాజమాన్య పద్ధతుల గురించి పరిశీలన జరిపి ఆ వివరాలు రాశారని చెప్పారు. ప్రపంచంలోనే అతిపెద్ద కళ్యాణ కట్ట నిర్వహణ విధానం, మహిళలు తలనీలాలు సమర్పించడానికి మహిళా క్షురకులను నియమించిన విషయాలు కూడా చక్కగా వివరించారని చెప్పారు. అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ ఆకెళ్ళ విభీషణ శర్మ, పుస్తక రచయితలు రవిచంద్రన్, వెంకట రమణయ్య పాల్గొన్నారు.

తెలుగు సాహితీ ఉత్సవాలకు..
దాసరి మునెయ్యకు ఆహ్వానం




ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పుత్తూరు పట్టణానికి చెందిన దాసరి మునెయ్యకు ఈనెల 9, 10వ తేదీలలో తిరుపతి మహతి ఆడిటోరియంలో జరిగే ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం అందింది. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో నమోదు చేసుకునేందుకు శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సాహిత్య సంబరాలకు ఆహ్వానించారు. నారాయణవనం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న దాసరి మునెయ్య కవిగా, ప్రభుత్వ పాఠ్యపుస్తక రచయితగా తన రచనలతో సమాజంలోని ఎన్నో విషయాలపై కవిత్వాలు రాయడంతో ఎన్నో అవార్డులు, ప్రశంసలు అందుకున్నారు. "బాలకవి మిత్ర" బిరుదు పొందడం, చైతన్యవంతమైన గీతాలను రాయడం, పాడటం ఆయన ప్రవృత్తి. గతంలో శ్రీ కళావేదికతో మూడుసార్లు ప్రపంచ స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందుకోవడం విశేషం. ఈ నేపథ్యంలో శ్రీశ్రీకళావేదిక నిర్వహించు సాహితీ బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించడం ఆనందంగా ఉందని.. అవకాశం కల్పించిన శ్రీశ్రీ కళావేదిక.అంతర్జాతీయ ఛైర్మన్ శ్రీ కత్తిమండ ప్రతాప్ కార్యవర్గ సభ్యులకు దాసరి మునెయ్య కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్‌బీకేఆర్ఐఎస్టీ గ్రంథాలయాధికారికి ఉత్తమ పురస్కారం



ప్రజాశక్తి-కోట: విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ఐఎస్టీ గ్రంథా లయాధికారి పి.రామిరెడ్డికి ఉత్తమ పురస్కార అవార్డు లభించింది. ఈపోవావ్ ఐసీఎస్ఎస్ఆర్ నేషనల్ సెమినార్ రామిరెడ్డి పరిశోధన వ్యాసానికి ఈ పురస్కారం దక్కింది. కర్నూల్‌లోని సిల్వర్‌జూబ్లీ ప్రభుత్వ కళాశాలలో ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ ఉత్తమ పరిశోధన అంశానికి గాను ఈ పురస్కారం రావడం జరిగిందని గ్రంథాలయాధికారి రామిరెడ్డి తెలిపారు. ఈ మేరకు కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి రామిరెడ్డిని అభినందించారు.

ఆచార్య రంగారెడ్డి సేవలు చిరస్మరణీయం




ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఆర్థికశాస్త్ర విభాగంలో మూడున్నర దశా బ్దాలకు పైగా సేవలందించిన డాక్టర్ ఎ.రంగారెడ్డి మృతికి ఎస్వీయూ వీసీ ఆచార్య రాజారెడ్డి తమ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయంలోని ఆర్థిక శాస్త్ర విభాగం అధ్యక్షులు ఆచార్య ఎమ్. దేవరాజులు, విశ్రాంత ఆచార్యులు డి.కృష్ణమూర్తి, ఆచార్య సునీత, డాక్టర్ రాధిక, అకడమిక్ కన్సల్టెంట్లు, పరిశోధకులు, విద్యార్థులు సంతాపం తెలిపారు.

ఘనంగా శివకుమార్‌రెడ్డి జన్మదినం



ప్రజాశక్తి-గూడూరు: గూడూరు కర్ణాల వీధిలో నివాసం ఉంటున్న వైసీపీ నేత పొణకా శివకుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పొణకా దేవసేనమ్మ నివాసంలో ఘనంగా జరిగాయి. శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాలయ కమిటీ సభ్యుడు యాదవ సంఘం నాయకులు పడ్డాల గోపాల్‌యాదవ్ ఆధ్వర్యంలో నాయకులు, అభిమానులు, శివాభి ఛానెల్ ఆపరేటర్లు, పీఎస్ఆర్ సంస్థల సిబ్బంది కలిసి సంబరాలు జరుపుకున్నారు. ముందుగా కేక్ కోసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు ముని, సాయి కబీర్, ఆపరేటర్లు రాజు, సర్వేపల్లి శ్రీరామ్, కుమార్, కాటూరి శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ



ప్రజాశక్తి-రేణిగుంట: అనాసంపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు శుక్రవారం ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పరీక్షలకు ఉపయోగపడే విద్యా సామాగ్రిని సంస్థ అధ్యక్షుడు జూలియన్‌రాజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు సునీత గౌడ్ మాట్లాడుతూ ముందుగా విద్యార్థులను ప్రోత్సహించేలా ఆషా సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు అనేక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో శోభారాణి, కేజీ కుమారి, పద్మావతి, మాధవి, శశికళ, నీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో...




గూడూరు: గూడూరు మండలం కొండగుంట జడ్పీ హైస్కూల్‌లో రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో 50 మంది పదోతరగతి విద్యార్థులకు శుక్రవారం విద్యాసామాగ్రి పంపిణీ చేశారు. అదే స్కూల్లో పనిచేస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు కష్ణంరాజు వితరణ చేశారు. రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ ధనుంజయరెడ్డి మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు రోటరీ వెస్ట్ క్లబ్ తరపున బహుమతులు ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కోటేశ్వరరావు, స్కూల్ ఛైర్మన్ బాబు, వాసుగౌడ్ హరినాధరెడ్డి, బలరాంరెడ్డి, రాజేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయ అభివృద్ధికి ఆమోదం

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ సెనేట్ సమావేశం శుక్రవారం ఉదయం సెనేట్ హాల్లో ఉపకులపతి ఆచార్య కె. రాజారెడ్డి అధ్యక్షతన జరిగింది. ప్రారంభోపన్యాసం చేసిన విసి విశ్వవిద్యాలయం గత సంవత్సరకాలంగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బోధన, పరిశోధన రంగాల్లో సాధించిన ర్యాంకులను వివరించారు. సమావేశంలో ఆచార్య అప్పారావు ,యం యం నాయుడు, రత్నాకర్ , నారాయణరెడ్డి, యస్ డి యస్ మూర్తి, మురళీధర్ , పద్మనాభం, తులసీ రామకృష్ణారెడ్డి , పాలకమండలి సభ్యులుపాల్గొన్నారు.

పునరావాస కేంద్రాల్లో విజిలెన్స్ తనిఖీలు



ప్రజాశక్తి-తిరుపతి సిటీ: జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థలచే నడపబడుతున్న పునరావాస కేంద్రాల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాంతీయ నిఘా, అమలు అధికారి కె.ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిజి శంఖభ్రతబాగ్చి ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా స్వచ్ఛంధ సంస్థలచే నిర్వహిస్తున్న పునరావాస కేంద్రాల సెంటర్లలో ఈ తనిఖీలు నిర్వహించామన్నారు. అందులో బాగంగా జిల్లాలోని అధికారులు నాలుగు బృందాలుగా ఏర్పడి శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు తిరుపతి, సత్యవేడు, వడమాలపేట, మంగళంతో పాటు 12 ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించామని తెలిపారు. ఆయా కేంద్రాల్లో ఎలాంటి మౌళిక సదుపాయాలు ఉన్నాయి, అందులో ఉన్న వారికి కల్పించే వసతులు ఎలా ఉన్నాయి, ప్రభుత్వ నిధులను సక్రమంగా వినియోగిస్తున్నారా?లేదా, వైద్య సదుపాయాలు ఉన్నాయా? లేదా అనే విషయాలపై తనిఖీలు చేశామన్నారు. తనిఖీలో వెల్లడిఐన అంశాలను నివేదిక రూపంలో ప్రభుత్వానికి అందిస్తామని తెలిపారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం


ఎమ్మెల్యేలు - కోనేటి ఆదిమూలం, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వెలగపల్లి వరప్రసాద్



పిచ్చాటూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



చిన్నగొట్టిగల్లులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి



గూడూరులో చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్

ప్రజాశక్తి-పిచ్చాటూరు: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించడమే వైసీపీ లక్ష్యమని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలో శుక్రవారం వైఎస్ ఆసరా మూడో విడత పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, ఎంపీపీ రేఖా, జడ్పీటీసీ విష్ణుప్రియ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సత్యవేడు నియోజకవర్గంలో వైఎస్ఆర్ ఆసరా 55 వేల మంది మహిళల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో అధికారులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గూడూరు: స్థానిక ఆర్డీవో కార్యాలయ ఆవరణలో వెలుగు ఆధ్వర్యంలో శుక్రవారం పొదుపు సంఘాల మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కులను ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లబ్ధిదారులకే నేరుగా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందాలనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో గూడూరు తహశీల్దారు లీలారాణి, ఎంపీడీవో వెంకటేశ్వర్లురావు, ఏపీఎం బుజ్జమ్మ, సీసీలు, పొదుపు సంఘాల మహిళలు, నాయకులు పాల్గొన్నారు.

యర్రావారిపాలెం: యర్రావారిపాలెంలో వైఎస్సార్ ఆసరా మహిళలకు శుక్రవారం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎమ్మెల్యే తనయుడు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో అమర్నాథ్, తహశీల్దార్ దస్తగిరయ్య, జడ్పీటీసీ కరుణాకర్‌రెడ్డి, తలకోన మాజీ ఛైర్మన్ రెడ్డెప్పరెడ్డి, నాగార్జునరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, ఏపీఎం, సీసీలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాగలాపురం: అక్కా చెల్లెమ్మల ఆర్థిక అభివృద్ధికి ఆసరాగా ఉండేందుకే సీఎం జగన్మోహన్ రెడ్డి వైఎస్సార్ ఆసరా పథకాన్ని ప్రవేశపెట్టారని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. నాగలాపురం టీటీడీ కళ్యాణ మండపంలో శుక్రవారం వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో పద్మజ, ఎమ్మార్వో ప్రసన్నకుమార్, ఎంపీపీ సింధు, పార్టీ మునిరత్నం, ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.



శ్రీకాళహస్తిలో ... చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

గూడూరు టౌన్ : మహిళల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ రావు అన్నారు. శుక్రవారం గూడూరు పట్టణంలోని షాదీ మంజిల్ లో మూడో విడత వైఎస్సార్ ఆసరా కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో వైసీపీ నాయకులు గోపాల్‌రెడ్డి , విజయ కుమార్, మంజుల, శ్రీనివాసులు, తాళ్లూరు శ్రీనివాసులు, అన్నం మురళి, అల్లాభ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నగొట్టిగల్లు: చిన్నగొట్టిగల్లు మండలంలో ఎంపీపీ బాలం యుగంధర్‌రెడ్డి, సహదేవరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా సంఘాల సభ్యులకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చేతుల మీదుగా వైఎస్ఆర్ ఆసరా చెక్కులను పంపిణీ చేశారు. తిరుపతి రూరల్ మండలాధ్యక్షుడు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, బాలం యుగంధర్ రెడ్డి, జడ్పీటీసీ సురావ మహేంద్రరెడ్డి, ఏపీఎం కుమారస్వామి, సీసీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: మహిళా సంక్షేమమే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం వైఎస్ఆర్ ఆసరా చెక్కులను పంపిణీ చేశారు. అంజూరు తారక శ్రీనివాసులు, గుమ్మడి బాలకష్ణయ్య, ఉన్నం వాసు నాయుడు, లోకేష్ యాదవ్, వయ్యాల కృష్ణారెడ్డి, పవిత్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒలంపియాడ్ పరీక్షలో విద్యార్థుల విజయం



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్ : పుత్తూరులోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు ఒలంపియాడ్ పరీక్షలో ఘన విజయం సాధించడంతో పాఠశాల ప్రిన్సిపల్ రవికిరణ్ శుక్రవారం అభినందించారు. 177 మంది విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాలతోపాటు బందారు పతకాలు, ధ్రువపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం కంటే ఎక్కువ మంది విద్యార్థులు ఉత్తీర్ణత కావడం ఆనందదాయకమని ప్రశంసించారు. ఏజీఎం డాక్టర్ శ్రీనివాసులు, కోఆర్డినేటర్ బాలాజీ విద్యార్థులకు బంగారు పతకాలను అందించారు. ప్రిన్సిపల్ శరవణ, జోనల్ డీన్ తిరునావకరసు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుపతి టౌన్: స్థానిక ఎస్టీవోనగర్‌లోని శ్రీ చైతన్య పాఠశాలలో ఐ.ఎన్.టి.ఎస్.ఒ స్టేజ్ –2 పోటీ పరీక్షలో అత్యున్నత ప్రతిభ కనపరిచారని పాఠశాల ఎ.జి.యం సురేష్ తెలిపారు. మొత్తం 117 మంది ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ చంద్రశేఖర్, రాధిక రాజ్ తెలిపారు. ఎంపికైన వారికి మెడల్స్, సర్టిఫికెట్స్ అందించారు. డీన్ పురుషోత్తం, ఒలింపియాడ్ ఇన్‌ఛార్జి రఫీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కోట: ఐ.యన్.టి.ఎస్.ఒ పరీక్షలో శ్రీ చైతన్య పాఠశాల నుంచి 268 మంది విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపల్ వెంకటసుధీర్ తెలిపారు. ఏజీఎం శ్రీకాంత్ విద్యార్థులకు ట్యాబ్‌లు, బంగారు పతకాలు, సర్టిఫికెట్లు అందించారు. డీన్ శివయ్య, కో–ఆర్డినేటర్ హిమబిందు, ఇన్‌ఛార్జిలు హరిత, వినీల, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

వేద విశ్వవిద్యాలయంలో సుదర్శనయాగం



ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంలో నూతన సంవత్సర ఉత్సవాల సందర్భంగా శుక్రవారం లోక కళ్యాణం కోసం సుదర్శన యాగం నిర్వహించారు. టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి దంపతులు, సంయుక్త కార్యనిర్వధికారి సదాభార్గవి, స్విమ్స్ డైరక్టర్ ఆచార్య వెంగమ్మ, విశ్వవిద్యాలయం కులపతులు ఆచార్య రాణి, సదాశివమూర్తి, డా.ఏవీ రాధే శ్యామ్, ప్రముఖులు ఫణి యజ్ఞేశ్వర యాజులు, విశ్వవిద్యాలయ అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

షాదీమహల్ నిర్మాణానికి భూమి పూజ



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: వడమాలపేట మండలం పూడి గ్రామంలో షాదీ మహల్ నిర్మాణానికి శుక్రవారం రాష్ట్ర పర్యాటనశాఖ మంత్రి ఆర్‌కే రోజా సోదరుడు రాంప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ వీఎం మాహీన్, ముస్లిం సోదరులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

లావణ్య కుమారికి జాతీయ స్థాయి అవార్డు



ప్రజాశక్తి-క్యాంపస్: తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాలలో స్టాటిస్టిక్స్, కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగంలో సహాయ ఆచార్యులు, విభాగాధిపతిగా పనిచేస్తున్న డాక్టర్ పి.లావణ్యకుమారికి జాతీయ స్థాయిలో శ్రీ పద్మావతి వేంకటేశ్వర ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీ రామకష్ణ పరమహంస రీసెర్చ్ గ్రాంట్ అగ్రికల్చరల్ అవార్డ్ 2022 సంవత్సరానికి గాను లభించింది. ఈ అవార్డును సైన్సు, టెక్నాలజీ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ చేతుల మీదుగా మార్చి 29వ తేదీన న్యూఢిల్లీలోని ఇండియా హ్యాబిటెట్ సెంటర్ లో అవార్డును అందుకున్నారు. డాక్టర్ లావణ్య కుమారికి అగ్రికల్చరల్ విభాగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బేస్డ్ పేస్ట్ మోడలింగ్ ఇన్ రైస్ క్రాప్ అనే ఉత్తమ పరిశోధనకు గాను ఈ అవార్డును లభించిందని వెల్లడించారు. అవార్డు గ్రహీత డాక్టర్ లావణ్య కుమారిని శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జి. ప్రభాకర్ రెడ్డి, కళాశాల అధ్యాపకులు, ఆర్ఏఆర్ఎస్ పరిశోధకులు అభినందనలు తెలిపారు.

విద్యార్థులు ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు



పిచ్చాటూరు

ప్రజాశక్తి-పిచ్చాటూరు: విద్యార్థులు ప్రణాళికతో చదివితే విజయం సాధ్యమని సాయిరాం విద్యాలయ నిర్వాహకులు గంగయ్య, గిరిబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని వెంగళత్తూరు సాయిరాం ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. విద్యార్థుల సాంస్కతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: విద్యార్థులు లక్ష్యాన్ని చేరుకునేందుకు కష్టపడి చదవాలని..అప్పుడే మంచి మార్కులు సాధించవచ్చని ప్రధానోపాధ్యాయులు విజయకుమారి, రమణయ్య అన్నారు. శుక్రవారం కల్లివెట్టు ఉన్నత పాఠశాల, బుచ్చినాయుడుకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు పరీక్షా సామాగ్రి అందించారు. ఉపాధ్యాయులు యువశ్రీ మురళీ, సురేష్‌బాబు, నాదెండ్ల మురళీ, దాసు, జయసుధ, వాణి, మాధవీలత, రామక్క, ఒబ్బుదేవి ప్రసాద్, వేణుగోపాల్, మోహన్ బాబు, దేవేంద్ర, స్వామిదాసు తదితరులు పాల్గొన్నారు.

పాకాల: కుదిబట్లబైలు ప్రాథమికోన్నత పాఠశాలలో అనుభవం కలిగిన ఉపాధ్యాయులచే విద్యను అందిస్తున్నారని సర్పంచ్ బుజ్జమ్మ అన్నారు. మండలంలోని పదిబట్లబైలు ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. అనంతరం విద్యార్థుల సాంస్కతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ప్రమీలమ్మ, సి.ఆర్.పి శ్రీనివాసులు, ఉపాధ్యాయులు వెంకటాచలం, సరితకుమారి, ఆసియా, మోహన్, పాఠశాల కమిటీ ఛైర్మన్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: విద్యార్థులు ఉత్తమ ప్రతిభతో ఉన్నత లక్ష్యం చేరుకోవచ్చునని ఎంఈవో భువనేశ్వరి అన్నారు. నారాయణ



బుచ్చినాయుడుకండ్రిగ

స్కూల్ వార్షికోత్సవం పట్టణంలోని ఎన్వీ ఎస్ కళ్యాణ మండపంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అక్కుర్తి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మయ్య, నారాయణ సంస్థ డీజీఎం కొండల రావు, ఏజీఎం కిశోర్ కుమార్, సురేష్ కుమార్, ప్రిన్సిపల్ కిరణ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గూడూరు టౌన్: గూడూరు రెండో పట్టణంలోని వి.ఎస్.ఆర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శుక్రవారం ఘనంగా గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. డాక్టర్ శివకుమార్, పాఠశాల డైరెక్టర్ బాలకృష్ణంరాజు , ప్రిన్సిపల్ శాంతకుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కేవీబీపురం: కావనూరు దళితవాడకు చెందిన దూల రామయ్య(47) శుక్రవారం ఉదయం రాగిగుంట గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా రాగిగుంట వద్ద రహదారిపై ద్విచక్రవాహనం అదుపుతప్పి వరిధాన్యంపై పడ్డాడు. ప్రమాదంలో రామయ్య తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మరణించాడు. ఎస్సై సునీల్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రహదారులపై వరిధాన్యాల ఒబ్బిడి చేయరాదని.. అలా రోడ్లపై పంటలను వేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టెక్నాలజీ మానవ జీవితంలో భాగం



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మన చుట్టూ ఉండే వాస్తవిక ప్రపంచానికి డిజిటల్ ఎలిమెంట్స్ జోడించి స్వల్ప మార్పులు చేస్తూ ఇటు వినోదాన్ని, అటు విజ్ఞానాన్ని అందించే ఆగ్ మెంటెడ్ రియాలిటీ– వర్చువల్ రియాలిటీలు మానవ జీవితంలో భాగమయ్యాయి అని శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. సుధాకర్ రెడ్డి అన్నారు. తిరుపతి–కరకంబాడి మార్గంలోని శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో మార్చి 27 నుండి నేటి వరకు వర్చువల్ రియాలిటీపై డిపార్ట్మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(డిఎస్టి), జాతీయ సాంకేతిక సంస్థ(సెర్బ్) ఆర్థిక ప్రోత్సాహంతో కళాశాల ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగం ఆధ్వర్యంలో ' ఆగ్ మెంటెడ్ రియాలిటీ–వర్చువల్ రియాలిటీ ఫండమెంటల్స్ ' అనే అంశంపై దాదాపు 100 మంది ఔత్సాహిక ఇంజినీరింగ్ అధ్యాపకులు, విద్యార్థులకు ఏఆర్–వీఆర్‌లపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇండస్ట్రీ 4.0 అడ్వైజర్, ఆర్ అండ్ డి సంచాలకులు, ప్రాన్స్ క్లైన్ టెక్నాలజీ డాక్టర్ పిన్నమనేని భాను ప్రసాద్ హాజరై ఏఆర్– విఆర్ ఆవశ్యకతను వివరించారు. ప్రిన్సిపల్ సుధాకర్ రెడ్డి, సమన్వయకర్తలు డాక్టర్ డి. శ్రీనివాసులు రెడ్డి, డాక్టర్ సి. చంద్రశేఖర్ కళాశాల ఛైర్మన్ గంగిరెడ్డి, వైస్ ఛైర్మన్ ప్రకాష్, అంబవరం ప్రదీప్, అంబవరం పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధిలోని తిరుమలనగర్ గ్రామ పంచాయతీలోని కోళ్ళఫారం సమీపంలో సర్వే నంబర్ 195లో ఇటీవల కొందరు అక్రమ నిర్మా ణాలను నిర్మించారు. అక్రమ నిర్మాణాల సమాచారం రెవెన్యూ అధికారులకు చేరడంతో శుక్రవారం మండల ఆర్ఐ జానీబాషా, వీఆర్వోలు భూపతి, సుమన్ కూల్చి వేశారు. తహశీల్దార్ వెంకటరమణ మాట్లాడుతూ నిర్మాణాలు కూల్చివేసిన స్థలం ప్రభుత్వ భూమి అని, ఈ స్థలంపై ఎవరికి ఎటువంటి పట్టాలు మంజూరు చేయలేదన్నారు. రెవెన్యూ ఆంక్షలు అతిక్రమించి ఎవరైనా నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

జాతీయ స్థాయి సాంకేతిక పోటీలు ప్రారంభం



ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాల ఈఈఈ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో విద్యుత్‌సవ్–2కే23 పేరుతో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న జాతీయ స్థాయి సాంకేతిక పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. దేశంలోని పలు ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ ఎ.లక్ష్మీదేవి, మహిళా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ పి.మల్లికార్జున, ప్రొఫెసర్ వి.సి. వీరారెడ్డి, కో–ఆర్డినేటర్ డి. నర్మిత, కన్వీనర్ ఎం. పల్లవి, కో–కన్వీనర్ కె. షాలిని, స్టూడెంట్ కన్వీనర్ బి. ప్రీతి, స్టూడెంట్ కో–కన్వీనర్ ఎన్. సుష్మ మరియు తదితరులు పాల్గొన్నారు.

దళిత మహిళా కార్మికులను పనిలో తీసుకోవాలి



ప్రజాశక్తి - రేణిగుంట: రేణిగుంట రైల్వే గ్యారేజి షాప్ (సిఆర్ఎస్)లో తొలగించిన 35 మంది దళిత మహిళా కార్మికులను పనిలో కొనసాగించాలని సిఐటియు ఆధ్వర్యంలో సిఆర్ఎస్ గేటు వద్ద శుక్రవారం ధర్నా చేపట్టారు. సిఐటియు మండల అధ్యక్షులు నరసింహారెడ్డి మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా పనిచేస్తూ ఉన్న 35 మంది దళిత మహిళా కార్మికులను పనిలో కొన సాగించాలన్నారు. గతంలో కాంట్రాక్టర్లు మారినా, కార్మికులను కొనసాగించేవారని, కొత్త కాంట్రాక్టర్ 35 మందిని తొలగించడం దారుణమన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్ తీరు మార్చుకుని వెంటనే కార్మికులను పనిలోకి తీసుకోవాలన్నారు. కార్మికులు ధర్నా చేస్తుండగా సిఆర్ఎస్ సెక్యూరిటీ అడ్డుకునే ప్రయత్నం చేయడాన్ని ఆక్షేపించారు. సమస్య పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు ఒ.వెంకటరమణ, శివానందం, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు ధరణి, మహిళాసంఘం నాయకులు పద్మమ్మ మద్దతు ప్రకటించారు.

'చలో ఢిల్లీ' గోడపత్రిక ఆవిష్కరణ



ప్రజాశక్తి-క్యాంపస్/ నాగలాపురం: ఏప్రిల్ 5న తలపెట్టిన 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో అగ్రికల్చర్ యూనివర్సిటీలో గోడపత్రికను ఆవిష్కరించారు. జిల్లా నాయకులు ఎస్.జయచంద్ర, నాగ వెంకటేష్, చిన్నబాబు, గంగులప్ప మాట్లాడుతూ దేశంలో కార్మికులు తీవ్రమైన కష్టాలు ఎదుర్కొంటున్నారని, దేశవ్యాప్తంగా ఉన్న పరిశ్రమలన్నీ మూసేసి కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పే ప్రయత్నం కొనసాగుతోందని వాపోయారు. కంపెనీలను అదానీ, అంబానీలకు ధారాదత్తం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకానికి కేంద్ర బడ్జెట్‌లోపూర్తిస్థాయిలో నిధులు తగ్గించారన్నారు. మరోవైపు రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో ఘోరంగా విఫలమయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు వరలక్ష్మి, కార్యదర్శి రాకేష్, ఉపాధ్యక్షురాలు చంద్రమ్మ సుబ్రమణ్యం, మదన్, రాధ, రమాదేవి, ప్రసాద్, మునిలక్ష్మి, నాగరత్న, జ్యోతి, సుశీల, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

నాగలాపురంలో... సిపిఎం కార్యదర్శి మురగేషన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్‌లో గోడపత్రికను ఆవిష్కరించారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడం, ఉచిత విద్యుత్ అందిస్తున్న రాష్ట్రాలలో వ్యవసాయ మోటార్లు పెట్టడం దారుణమన్నారు.

రైతులకు ఉచితంగా మొక్కలు



ప్రజాశక్తి-తొట్టంబేడు: మండలంలోని రౌతు సూరమాల గ్రామంలో ఉన్న గ్రీన్‌ప్యానెల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ గత నాలుగు సంవత్సరాల నుండి ప్రతిష్టాత్మకమైన ప్లాంటేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించినప్పటి నుండి కంపెనీకి 30 కిలోమీటర్ల పరిధిలోని రైతులందరికీ యూకలిప్టస్ , క్లోనల్ మొక్కలను ఉచిత సరఫరా చేయడం ప్రారంభించింది. 30 కి.మీ కంటే ఎక్కువ దూరంలో ఉన్న రైతులందరికీ సబ్సిడీ ధరపై క్లోనల్ మొక్కలను సరఫరా చేస్తోంది. రైతులను ప్రోత్సహించి వారికి సరైన ధర వచ్చేలా చేసేందుకు తమ సంస్థరైతుల నుంచి నేరుగా కలప కొనుగోలుకు శ్రీకారం చుట్టింది. 2–అంగుళాల కంటే ఎక్కువ లావు ఉన్న కలపను కంపెనీకి చేర్చగా రూ . 3,250 మెట్రిక్ టన్నులు, రెండు అంగుళాల కంటే తక్కువగా ఉన్న కలపను కంపెనీకి చేర్చగా రూ.2,700గా కొనుగోలుకు కంపెనీ నిర్ణయించింది. ప్రత్యక్ష కొనుగోలు సేవల కోసం 8700493301, 9100888677, 7217892235 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.